క్లుప్తంగా

ఘనంగా గణేష్ నిమజ్జనం



బీఎన్‌కండ్రిగలో పూజలు చేస్తున్న గ్రామస్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం గణేష్ నిమజ్జనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక తూర్పు మిట్ట, ఈబీసీ కాలనీ, నీర్పాకోటతోపాటు, ఎస్సీ, ఎస్టీకాలనీలు, కాటూరు, పల్లమాల, పీవీ కండ్రిగ, పుత్తేరి, బీఎస్‌పురం, పార్లపల్లె, కొత్త పాళెం గ్రామాల్లో నిమజ్జన కార్యక్రమాలు కోలాహలంగా నిర్వహించారు. వినాయకస్వామి ప్రతిమలకు పూజలు చేసి, పూలతో అలంకరించి, నైవేద్యం సమర్పించి, తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. యువకులు ఉత్సాహంగా ఉట్లోత్సవం నిర్వహించారు. పలు గ్రామాల్లో మధ్యాహ్నం అన్నదానం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని అంజిమేడు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఏర్పేడు సీఐ శ్రీహరి కథనం మేరకు, వెంకటగిరికి చెందిన తేజ(43), సుబ్రమణ్యం(41) ద్విచక్ర వాహనంపై తిరుపతికి బయల్దేరారు. మార్గమధ్యంలో అంజిమేడు వద్ద కారును తప్పించబోయి అదుపుతప్పి కిందపడ్డారు. దీంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. చికిత్స కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే..



విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ: విద్యాహక్కు చట్ట ప్రకారం బడిఈడు పిల్లలు బడిలో ఉండాలని మండల విద్యాశాఖాధికారి రవీంద్రనాథ్ పిల్లల తల్లిదండ్రులకు తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని ఆర్.అనంతాపురం గిరిజన కాలనీలో డ్రాపౌట్స్ ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లలను తిరిగి పాఠశాలకు పంపించారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యాబోధన చేయడంతో పాటు ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, బెల్ట్, నోట్ బుక్స్, డిక్షనరీ, బూట్లు, సాక్సులు ఇస్తోందని, మధ్యాహ్నం భోజనం పెడుతోందని వివరించారు. పిల్లలను బడికి పంపితే ప్రభుత్వం అమ్మ ఒడి పథకంలో తల్లికి రూ.14 వేలు ఇస్తుందని, దీనిని సద్వినియోగం చేసుకుని పిల్లల భవితకు బాటలు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విశ్వనాథ, బాలకృష్ణ, సీఆర్‌పీ లీలాకుమార్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం చేస్తున్న బియ్యపు ఆకర్ష్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలో తుపాన్‌సెంటర్‌కు చెందిన వెంకటమ్మ, ప్రాజెక్టు వీధికి చెందిన కన్నమ్మ శుక్రవారం అనారోగ్యంతో మరణించారు. వారిది నిరుపేద కుటుంబం కావడంతో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన తన కుమారుడు బియ్యపు ఆకర్ష్‌రెడ్డి ద్వారా రెండు కుటుంబాలకు రూ.10వేలు చొప్పున ఆర్థిక సాయం చేశారు. కుటుంబాలకు అండగా ఉంటామని ఆకర్ష్‌రెడ్డి వారికి భరోసా ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మానవాళి మనుగడకు నావల్ డ్రగ్ డెలివరీ సిస్టం ఉత్తమం

రామచంద్రాపురం: విషపూరితాల నుంచి మానవాళిని రక్షించేందుకు నావల్ డ్రగ్ డెలివరీ సిస్టం ఉత్తమమైనదని పద్మావతి మహిళా వర్సిటీ ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ ప్రొఫెసర్ నాగరాజు తెలిపారు. వెంకట్రామాపురం సమీపంలో ఉన్న సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం అనంతపురం జేఎన్‌టీయూ ప్యాకల్టీ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో రీసెంట్ అడ్వాన్సెస్, ట్రెండ్స్ అండ్ చాలెంజెస్ ఇన్ ఫార్మాస్యూటికల్ నానో టెక్నాలజీ రీసెర్చ్ టు రెవెన్యూ అనే అంశంపై ఇస్తున్న శిక్షణలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కొత్త మందులపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఎస్వీయూ వైరాలజీ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ నరసింహ మాట్లాడుతూ నానో టెక్నాలజీ ద్వారా క్యాన్సర్, హెచ్‌ఐవీ చికిత్సలో పెనుమార్పులు వస్తాయన్నారు. ప్రిన్సిపాల్ నిరంజన్‌బాబు, కరస్పాండెంట్ సుమలత తదితరులు పాల్గొన్నారు.

ఏపీ హైకోర్టు ఉత్తర్వులు సమర్థనీయం

తిరుపతి లీగల్: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో నారా చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను ఏపీ హైకోర్టు కొట్టివేయడం సమర్థనీయమని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు టి.మునిబాలసుబ్రమణ్యం (దొరబాబు) శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబును తమ కస్టడీకి ఇవ్వాలని సీఐడీ ఏసీబీ కోర్టులో పిటిషన్ వేసింది. ఈ క్రమంలో ఏసీబీ కోర్టు చంద్రబాబును రెండు రోజులు కస్టడీకి ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

కోలాహలం.. నిమజ్జనోత్సవం

ఏర్పేడు: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజైన శుక్రవారం పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనం కోలాహలంగా సాగింది. గ్రామాల్లో వినాయక స్వామి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. యువకులు, విద్యార్థులు, గ్రామస్తులు ఉట్టి కొట్టారు. పలు గ్రామాల్లో పరుగు, సైకిల్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. శుక్రవారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో విగ్రహాలను పుర వీధుల్లో ఊరేగించారు. గ్రామస్తులు వినాయక స్వామికి పూజలు చేశారు. చెరువుల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

భక్తిశ్రద్ధలతో నిమజ్జనం

నారాయణవనం: మండలంలో చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. స్థానిక వీరరాఘవ దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన భారీ విగ్రహానికి మధ్యాహ్నం ప్రత్యేక పూజలను నిర్వహించి అన్నప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. సుమారు 500 మందికి అన్నప్రసాదాల వితరణ చేశారు. సాయంత్రం ట్రాక్టర్‌పై గణేష్ విగ్రహాన్ని డప్పుల వాయిద్యాల హోరు నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి సమీపంలోని అరుణానదిలో నిమజ్జనం చేశారు. «చంద్రయాన్‌» విజయవంతం కావడాన్ని సూచించేలా ఎగువవగాండ్ల వీధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం పలువురినీ ఆకర్షిస్తోంది. అలాగే నగరు వీధిలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమ వద్ద మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి వాణిజ్య సంఘం బహుమతులను అందజేసింది. వెత్తలతడుకులో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి ప్రత్యేక పూజల చేసి, ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువులో నిమజ్జనం చేశారు.



రేణిగుంట ఎంజీ వీధిలో భక్తులకు అన్నదానం

ఉత్సవాల్లో అన్నదానం

రేణిగుంట: పట్టణంలోని ఎంజీ వీధిలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద శుక్రవారం అభయ వినాయక అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. బీడీ బాలాజీ, సుమన్, భూపతి కలసి వెయ్యిమంది భక్తులకు అన్నదానం చేశారు. ఇన్‌చార్జి ఎంపీడీవో రత్నమ్మ స్వామివారిని దర్శించుకుని అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అతిథులకు అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మణ్, జూలియస్ రాజు తీర్థప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా హోమపూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని భేరివారి మండపం వద్ద ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయకస్వామికి శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ దంపతుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా హోమపూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.



అంజిమేడు ఎస్సీ కాలనీలో వినాయక స్వామి ఊరేగింపు



నారాయణవనంలో చంద్రయాన్ గణేష్ ప్రతిమ



వీరరాఘవ ఆలయం వద్ద పూజలందుకుంటున్న వినాయకుడు



వెత్తలతడుకులో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు

‘జగనన్న ఆరోగ్య సురక్ష’ సర్వే పరిశీలన

సత్యవేడు: పంచాయతీలోని బీసీ కాలనీ, ఎస్టీకాలనీ, విడోస్ కాలనీలలో చేస్తున్న ‘జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే’ను ఎంపీడీఓ చంద్రశేఖర్ శుక్రవారం పరిశీలించారు. సర్వే పక్కాగా చేయడంతోపాటు దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల ఆరోగ్యం ఎలా ఉందో ఆ వివరాలను నమోదు చేయాలన్నారు. గర్భిణులకు ఆరోగ్య సూత్రాలు తెలియజేసి వారికి వైద్యశాలలో సుఖ ప్రసవంపై అవగాహన కల్పించాలన్నారు. ఆయా ఇళ్లకు వెళ్లినపుడు వారి సెల్‌ఫోన్లలో ఆరోగ్యశ్రీ సిటిజన్ యాప్ డౌన్‌లోడ్ చేయించాలన్నారు. సర్వేలో ప్రధానంగా రోగులు, గర్భవతులు వివరాలు తెలుసుకుని యాప్‌లో నమోదు చేయాలన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రజలకు ఉచితంగా వైద్యం ప్రభుత్వం అందిస్తుందని కరపత్రాలు ద్వారా ప్రజలకు తెలపాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం స్వాతి, వాలంటీర్ ఆశోక్‌కుమార్, ఆశావర్కర్లు రాములమ్మ, కే. జమున, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



సత్యవేడులో సర్వే వివరాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

శ్రీసిటీలో ‘పోష్’ చట్టంపై అవగాహన సదస్సు



పోష్ చట్టంపై అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న తిలగ పోర్సెల్వాన్

వరదయ్యపాళెం: పని ప్రదేశాలలో లైంగిక వేధింపుల నివారణ (పోష్-ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హరాస్‌మెంట్) చట్టంపై శుక్రవారం శ్రీసిటీలో అవగాహన సదస్సు నిర్వహించారు. శ్రీసిటీ, మద్రాస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఎంఎంఏ), కాస్‌లు సంయుక్తంగా ఈ సదస్సును ఏర్పాటు చేశాయి. సీనియర్ పోష్ శిక్షకురాలు తిలగ పోర్సెల్వాన్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. 2013 పోష్ చట్టం ఆధారంగా విశాఖ వర్సెస్ రాజస్థాన్ ల్యాండ్ మార్క్ తీర్పు ఫలితం ఎలా వచ్చిందో ఉదాహరణతో లైంగిక వేధింపుల అర్థాన్ని, పరిశ్రమల ఉద్యోగులకు పోష్ చట్టం ఆవశ్యకతను విపులీకరించారు. వ్యక్తులు, సంస్థలపై లైంగిక వేధింపుల హానికర ప్రభావాన్ని వివరిస్తూ సురక్షితమైన వాతావరణం అవసరాన్ని ప్రస్తావించారు. పోష్‌లో భాగమైన అంతర్గత ఫిర్యాదుల కమిటీల (ఐసీసీ) పాత్ర, ఫిర్యాదు దాఖలు విధానాలను ఆమె తెలియజేశారు. లైంగిక వేధింపులు ఎదురైనప్పుడు వారి హక్కులను కాపాడుకోవడంతో పాటు తగిన రీతిలో ఎలా ప్రతిస్పందించాలో చెప్పారు. తొలుత చెన్నైకు చెందిన మద్రాస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధి సతీష్ కుమార్.. సదస్సు ప్రాముఖ్యతను తెలియజేశారు. మహిళలు వేధింపుల నుంచి ఎలా బయటపడాలో తెలుసుకోవడంతో పాటు సురక్షితమైన వాతావరణం సృష్టించడంలో ఇలాంటి సదస్సులు ఎంతగానో ఉపయోగపడుతాయని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పేర్కొన్నారు. ముఖ్యఅతిథులుగా వచ్చిన వక్తలకు శ్రీసిటీ హెచ్‌ఆర్ ఏజీఎం శివకుమార్ సాదర స్వాగతం పలికారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

వరదయ్యపాళెం: పరిసరాల శుభ్రతతో అందరూ ఆరోగ్యవంతులుగా ఉండొచ్చని సంతవేలూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మాధవయ్య అన్నారు. స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా సంతవేలూరులో స్థానిక హైస్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. పరిసరాల శుభ్రతపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా వేసేందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సంతవేలూరు పంచాయతీ కార్యదర్శి హబీబ్, వెల్ఫేర్ అసిస్టెంట్ రాజశేఖర్, వ్యాయామోపాధ్యాయుడు మనోహర్ పాల్గొన్నారు.



సంతవేలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

దక్షిణ కైలాసధామం పనుల పరిశీలన



దక్షిణ కైలాసధామం పనులను పరిశీలిస్తున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి స్వర్ణముఖి నది ఒడ్డున దక్షిణ కైలాసధామం పేరుతో ఏర్పాటు చేసిన హిందూ శ్మశాన వాటికను శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరాలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సుమారు రూ.27 కోట్ల వ్యయంతో సకల సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చొరవతో పనులు జరుగుతున్నాయన్నారు. తొలి దశలో రూ.2.5కోట్ల పురపాకల సంఘ నిధులతో గ్యాస్ బర్నింగ్ యూనిట్ ఏర్పాటు చేశామన్నారు. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు శ్రీనివాసులురెడ్డి, సుదర్శన్ రెడ్డి, కామేశ్వరారవు, పురపాలకసంఘ అధికారులు లలిత, యుగంధర్, చెంచయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో సాగాలి



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న అధ్యాపకులు

శ్రీకాళహస్తి: విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రాజశేఖర్ అన్నారు. పట్టణంలోని తెలుగుగంగ కాలనీలో ఉన్న మహిళా డిగ్రీ కళాశాలలో 35వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో లక్ష్యాలను సాధించాలన్నారు. తమకు ఇష్టమైన రంగాన్ని ఎంచుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మహిళలు అన్ని రంగాల్లో ముందున్నారని గుర్తుచేశారు. అనంతరం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ సుకుమార్‌రెడ్డి, విశ్రాంత సంస్కృతభాష అధ్యాపకులు సుబ్బరాయుడు, వైస్ ప్రిన్సిపాల్ మురళి, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షురాలు కల్పన, అధ్యాపకులుపాల్గొన్నారు.

ఎంపీడీఓగా కృష్ణమూర్తి



కృష్ణమూర్తి

నారాయణవనం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కృష్ణమూర్తి బాధ్యతలు స్వీకరించారు. గంగవరం ఈఓపీఆర్డీగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఆయన ఇక్కడికొచ్చారు. గతంలో నారాయణవనం పంచాయతీ ఈఓగా ఆయన పనిచేశారు.

గణనాథుని సేవలో ఎంపీపీ



కుర్రకాల్వలో వినాయకుని దర్శించుకున్న ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి



ఏర్పేడు గొల్లవీధిలో లడ్డూను దక్కించుకున్న జ్యోతిప్రకాష్ యాదవ్

రేణిగుంట: మండలంలోని కుర్రకాల్వలో గణేష్ నిమజ్జనం సందర్భంగా శుక్రవారం రాత్రి రేణిగుంట ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. గ్రామానికి చెందిన కుర్రకాల్వ వేణు ముదిరాజ్ ఆయన్ను శాలువాతో సత్కరించారు. ఆయన వెంట గాజులమండ్యం సర్పంచ్ గంగారి రమేష్, జువ్వల దయాకర్‌రెడ్డి, మణికంఠ పాల్గొన్నారు.

ఏర్పేడులో గణనాథుని లడ్డూ వేలం

ఏర్పేడు గొల్లవీధిలో ఏర్పాటు చేసిన వినాయకుని లడ్డూను శుక్రవారం రాత్రి వేలం వేశారు. లడ్డూను వేలంలో స్థానిక జ్యోతి బుక్ షాపు యజమాని జ్యోతిప్రకాష్‌యాదవ్ రూ.15వేలకు దక్కించుకుని లడ్డూను భక్తులకు పంచిపెట్టారు. అనంతరం గణనాథుని భారీ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి, ప్లేట్లు, గ్లాసుల వితరణ

సత్యవేడు: మండలంలోని సీతారాంపేట, పుదుకుప్పం ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 62 మంది విద్యార్థులకు గ్రామానికి చెందిన ఎస్‌ఆర్‌ఐ విజయ్ శ్వేత దంపతులు విద్యాసామగ్రి, ప్లేట్లు, గ్లాసులు వితరణ చేశారు. వారి వివాహ వార్షికోత్సవం పురస్కరించుకుని తన తండ్రి భక్తవత్సలం(విశ్రాంత రైల్వే ఉద్యోగి) చేతుల మీదుగా వీటిని అందజేశారు. అలాగే విద్యార్థుల విందు ఏర్పాటు చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎంఈఓ కే.రవి మాట్లాడుతూ, విద్యార్థుల అవసరాలను తెలుసుకుని వాటిని దాతలు తీర్చడం సంతోషంగా ఉందని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ-2 ఉష, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భువనేశ్వరి(సీతారాంపేట), శిరీష(ఆంబాకం), సీఆర్‌పీ బాలకృష్ణ, మాజీ సర్పంచ్ గుణ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ

నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలకు ఎంపిక

నాగలాపురం: మండల కేంద్రంలో శుక్రవారం సత్యవేడు నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. అండర్-14, అండర్-17 విభాగాలలో బాల బాలికలకు కబడ్డీ, యోగా, టెన్నికాయిట్ పోటీలు నిర్వహించారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపీపీ సింధు ఈ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు శారీరక, మానసిక ఆరోగ్యంతో ఉన్నప్పుడే విద్యలోనూ రాణిస్తారని, దీనికి క్రీడలను ఒక సాధనంగా చేసుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు కస్తూరయ్యా మాట్లాడారు. అనంతరం పోటీల్లో క్రీడాకారులు చాటిన ప్రతిభ ఆధారంగా 9 మందిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.బాబు తెలిపారు. కార్యక్రమంలో నాగలాపురం సర్పంచ్ సుధ, వైస్ ఎంపీపీ కుమారి, మండల సచివాలయ కన్వీనర్ మోహన్ మొదలియార్, సచివాలయ ముత్తు, మార్కెట్ కమిటీ మెంబరు కులశేఖర్ రెడ్డి, వార్డు మెంబర్ చిరంజీవి, మెయిన్ స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ దేశన్, గిరిబాబు, ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.



క్రీడా పోటీల ప్రారంభంలో మాట్లాడుతున్న వక్తలు

విద్యతోపాటు క్రీడలు అవసరం

శ్రీకాళహస్తి: విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు అవసరమని శ్రీకాళహస్తి ఎంఈవో భువనేశ్వరి అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నియోజకవర్గ స్థాయి పోటీలను శుక్రవారం పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలల్లో నిర్వహించారు. అండర్-17, అండర్-14 విభాగాల్లో వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ఎంఈవో భువనేశ్వరి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఆర్కాట్ శంకర్ ప్రారంభించారు. నియోజకవర్గ పరిధిలో శ్రీకాళహస్తి, ఏర్పేడు, తొట్టంబేడు, రేణిగుంటకు చెందిన పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, పీడీలు రమణ, వెంకటముని, ఇందిర, సరోజిని, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు